క్లుప్తంగా

రోడ్ల మలుపు వద్ద గోళాకార అద్దం ఏర్పాటు



మలుపు వద్ద ఏర్పాటు చేసిన గోళాకార అద్దం

దెందులూరు: తరచూ ప్రమాదాలు జరుగుతున్న దెందులూరు రోడ్డు మలుపు వద్ద రోడ్లు భవనాల శాఖ గోళాకార అద్దం ప్రమాద సూచికగా ఏర్పాటు చేశారు. రోడ్లు భవనాల శాఖ దెందులూరు మండలం జూనియర్ ఇంజనీర్ ఎన్ శేషు కుమార్ ఈ అద్దాన్ని పరిశీలించారు. ఎంతోకాలంగా ఈ మలుపు వద్ద ఎటువంటి ప్రమాద సూచికలు లేకపోవడంతో అనేక ప్రమాదాలు జరిగాయి. అద్దం మలుపు వద్ద ఏర్పాటు చేయడంపై ప్రయాణికులు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సుమమ్ సినిమా చిత్రీకరణ ప్రారంభం



సెయింట్ జాన్స్ విద్యా సంస్థలో సుమమ్ సినిమా చిత్రీకరణ

దెందులూరు: ఆర్‌వీ స్టూడియోస్ ద్వారా వల్లభనేని సురేష్ చౌదరి డైరెక్టర్‌గా ఓటీటీ వేదికగా ప్రదర్శించే సుమమ్ సినిమా చిత్రీకరణ బుధవారం సోమవారం సెయింట్ జాన్స్ విద్యా సంస్థల్లో నిర్వహించారు. ఆర్‌సీఎం ఏలూరు పీఠం వికార్ జనరల్ డాక్టర్ ఫాదర్ పి బాల క్లాప్ కొట్టారు. డైరెక్టర్ సురేష్ చౌదరి మాట్లాడుతూ మధుపల్లి తరుణ్‌సాయి కథానాయకుడిగా నూతన తారాగణంతో సినిమా చిత్రీకరిస్తున్నట్టు తెలిపారు. సహాయ డైరెక్టర్లు సత్యం వేణు తారాగణం ఉన్నారు.

మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీలపై ఎంపీడీవో ఆగ్రహం




మధ్యాహ్న భోజనంపై విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపీడీవో జీఆర్ మనోజ్

ఉంగుటూరు: మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీలపై ఎంపీడీవో జీఆర్ మనోజ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం మండలంలోని రావులపర్రు, వీఏపురం, కాకర్లమూడి, కాగుపాడు సచివాలయాలను ఆయన సందర్శించారు. ఈ క్రమంలో రావులపర్రు, వీఏపురంలో అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. అనంతరం కాకరమూడిలోని సచివాలయాన్ని, కాగుపాడులో జెడ్పీహైస్కూల్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. జెడ్పీహైస్కూల్లో విద్యార్థులతో ఆయన మాట్లాడారు. ఈ నేపథ్యంలో విద్యార్థులు మిడ్‌డే మీల్స్ సరిగా లేదని ఎంపీడీవోకు తెలపడంతో, ఆయన వెంటనే ఏజెన్సీ సభ్యులను పిలిచి హెచ్చరించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యసేవలపై ఆరా తీశారు. మందుల లభ్యతను అడిగి తెలుసుకున్నారు.

పదో తరగతి మోడల్ పేపర్ల పంపిణీ

నిడమర్రు: పెదనింద్రకొలను జెడ్పీ స్కూల్లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు ఆ పాఠశాల పూర్వ విద్యార్థిని నిప్పులేటి బిందునాగదుర్గ రూ.10 వేలు విలువైన మాదిరి ప్రశ్నాపత్రాలను పంపిణీ చేసారు. అదే పాఠశాలలో 2017లో టెన్త్‌లో స్కూల్ ప్రథమంలో నిలిచిన బిందునాగదుర్గ సేవా దృక్పథంతో సాహాయం అందించడం అభినందనీయమని వంగా రఘు, చింతలపాటి బాసిరాజు అన్నారు.

మైక్‌సెట్ బహూకరణ



మైక్‌సెట్ అందిస్తున్న పూర్వ విద్యార్థులు

నిడమర్రు: అడవికొలను పోశింశెట్టి రామమూర్తి జెడ్పీ స్కూల్లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో 2009-10 ఎస్ఎస్‌సీ బ్యాచ్ విద్యార్థులు రూ.12వేలు విలువైన మైక్ సెట్‌ను పాఠశాలకు బహూకరించారు. అదే పాఠశాలలో చదివి హైదరాబాద్‌లో సీఐగా విధులు నిర్వహిస్తున్న పోలిశెట్టి సతీష్ రూ.5వేలు విలువైన ఆఫీస్ టేబుల్‌ను హెచ్‌ఎం పి. సుబ్బలక్ష్మికి అందించారు. ఈ కార్యక్రమంలో బొండా నర్సింహం, టీచర్స్ ఉన్నారు.

మద్యం షాపునకు దరఖాస్తు చేసుకోండి

భీమడోలు: నిడమర్రు మండలంలోని గీత కార్మిక వర్గానికి చెందిన శెట్టి బలిజ కులానికి కేటాయించిన మద్యం దుకాణం లబ్ధిదారు ఎంపిక ప్రక్రియకు దరఖాస్తులు స్వీకరణకు గడువును మరో మూడు రోజులు పొడిగించారని భీమడోలు ప్రొహిబిషన్ అండ్ ప్రొహిబిషన్ సీఐ బి.సత్యనారాయణ తెలిపారు. ఈనెల 8వ తేదీ శనివారం సాయంత్రం 5 గంటలకు వరకు పొడిగించినట్లు ఆయన పేర్కొన్నారు.

అన్నదాతకు అండ.. ఈ-పంట

- నత్తనడకన ఈ-క్రాప్, ఈ-కేవైసీ నమోదు
- ఈనెల 25 వరకూ గడువు



చిరుపొట్టతో ఏపుగా ఎదుగుతున్న వరి పైరు



గణపవరంలో ఈ-క్రాప్ నమోదు పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి

గణపవరం: ప్రకృతి విపత్తుల వల్ల పంట నష్టపోయిన రైతులను ఆదుకోవడానికి ప్రభుత్వాలు బీమా సదుపాయం కల్పిస్తున్నాయి. పండించిన పంటను ప్రభుత్వాలే కొనుగోలు చేస్తున్నాయి. అయితే ప్రభుత్వం పంటల బీమా, పంటలను కొనుగోలు చేయడం వంటి సదుపాయాలను వినియోగించుకోవాలంటే రైతులకు పంట నమోదు, ఈకేవైసీను తప్పనిసరి చేసింది. రైతుల ప్రయోజనార్ధం రూపొందించిన ఈ క్రాప్‌కు సంబంధించి ఈ-కేవైసీ నమోదు ప్రక్రియ గడువు త్వరలో ముగియనుంది. రైతు సేవా కేంద్రంలో వ్యవసాయశాఖ గ్రామ సహాయకులు పంట నమోదుతో పాటు ఈ-కేవైసీ ప్రక్రియ నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం అందించే పథకాలు పొందాలంటే రైతులు త్వరగా ఈ-కేవైసీ చేయించు కోవాలని అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

నియోజకవర్గంలో 90 శాతం నమోదు

ఉంగుటూరు నియోజకవర్గంలో ఇప్పటివరకూ 90 శాతం రైతులు ఈ-పంట నమోదు చేసుకున్నారు. ఈకేవైసీ మాత్రం 45 శాతం మంది మాత్రమే చేయించుకున్నారు. ఇంకా 10శాతం రైతులు పంట నమోదు, 55 శాతం రైతులు ఈ-కేవైసీ నమోదు చేయించుకోవాల్సి ఉంది. ఈనెల 25తో గడువు ముగియనుండటంతో రైతులు త్వరపడి పంట నమోదుతో పాటు, ఈ-కేవైసీ చేయించుకోవాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

ప్రయోజనాలివీ

రైతులు చేసిన పంటల వివరాల నమోదుతో పాటు ఈ-కేవైసీ చేయించుకుంటే రైతులకు పలు ప్రయోజనాలు ఉన్నాయి. ముఖ్యంగా పంటల బీమా, పెట్టుబడి రాయితీ, మద్దతు ధర, పంట ఉత్పత్తుల కొనుగోలు వంటి ప్రయోజనాలు పొందవచ్చును. వ్యవసాయ శాఖద్వారా వచ్చే అన్ని పథకాలు, రాయితీలు పంట నమోదు చేసుకున్న రైతులకు మాత్రమే వర్తిస్తాయని వ్యవసాయ అధికారులు చెబుతున్న మాట. రైతులు కూడా సహకరించి సాగు చేసిన పంటల వివరాలను నమోదు చేసుకోవాలని సూచిస్తున్నారు.

నియోజకవర్గంలో నమోదు వివరాలు (శాతాల్లో)

మండలం	విస్తీర్ణం (ఎకరాలు)	ఈ-క్రాప్	ఈ-కేవైసీ
గణపవరం	11,700	98	52
ఉంగుటూరు	21,173	91	40
భీమడోలు	10,670	90	58
నిడమర్రు	5,320	80	50

ఈ-క్రాప్, ఈ-కేవైసీ రెండూ తప్పనిసరి


రైతులు తాము పండించే పంటను నమోదు చేయించుకోవడంతో పాటు ఈ-కేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలి. చాలా మంది రైతులు పంట నమోదుతోనే సరిపెడుతున్నారు. పంటను విక్రయించాలన్నా, కనీస మద్దతు ధర పొందాలన్నా, బీమా పరిహారం పొందాలన్నా పంట నమోదు, ఈ-కేవైసీ రెండూ తప్పనిసరి. రైతు బయోమెట్రిక్ ఇవ్వడంతోపాటు, ఓటీపీతో ఈ-కేవైసీ చేసుకోవడానికి వెసులుబాటు ఉంది. ఈనెల 25తో నమోదు గడువు ముగుస్తున్నందున త్వరగా గ్రామాల్లోని రైతులు రైతు సేవా కేంద్రాలకు వెళ్లి ఈ-క్రాప్, ఈ-కేవైసీ నమోదు చేయించుకోవాలి.

– ఉషారాజకుమారి, ఏడీఏ, భీమడోలు

షోకాజ్ నోటీసు జారీపై సర్పంచ్ ఆగ్రహం

భీమడోలు: పంచాయతీలో పాలన లోపాలకు సర్పంచ్‌ని బాధ్యురాలిని చేస్తూ షోకాజ్ నోటీసు ఇవ్వడం సరైన నిర్ణయం కాదని భీమడోలు పంచాయతీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ మహిళా నేత పి.సునీత అన్నారు. భీమడోలులో బుధవారం ఆమె మాట్లాడుతూ 2019-20, 20-21 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించి పంచాయతీలో నిధులు దుర్వినియోగమైనట్టు అధికారులు గుర్తించి దీనికి సర్పంచ్‌ను బాధ్యురాలిని చేయడం సహేతుకం కాదన్నారు. తాము ఎన్నిక కాకముందు ప్రత్యేకాధికారుల పాలనలో జరిగిన తప్పులకు తాము ఎందుకు బాధ్యత వహించాలని ప్రశ్నించారు. పంచాయతీలోని ప్రతి పైసా ఖర్చుపై సీఎఫ్ఎంఎస్‌లో సరైన కారణాన్ని చూపుతూ అప్‌లోడ్ చేస్తామన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఓ వ్యక్తి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో ఇచ్చిన ఫిర్యాదుపై డీఎల్‌పీవో విచారణ చేసి సర్పంచ్‌కు షోకాజ్ నోటీసును అందించడం విడ్డూరంగా ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ మద్దతుతో తాను సర్పంచ్‌గా గెలవడంతో పాటు దళిత మహిళను కావడం వల్లే సంబంధం లేని తప్పులకు బాధ్యురాలిని చేస్తున్నారన్నారు. దీనిపై హైకోర్టుకు వెళ్లామన్నారు. డీపీవోపై కూటమి నేతల ఒత్తిడి వల్లే ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని ఆమె వాపోయారు.

అచ్చమ్మ పేరంటాలమ్మ వారికి కుంకుమతో అలంకరణ



భీమ నాగలింగేశ్వర స్వామి



అచ్చమ్మ పేరంటాలమ్మకు కుంకుమతో అలంకరణ

దెందులూరు: గాలాయగూడెం అచ్చమ్మ పేరంటాలమ్మ అమ్మవారి 68వ ఉత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారికి కుంకుమతో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు శర్మ అలంకరణ చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని ఆలయ ప్రదక్షిణలు నిర్వహించి అమ్మవారికి పూజలు చేశారు. అమ్మవారి చీర, గాజులు, లడ్డు ప్రసాదాన్ని కొనుగోలు చేసుకుని తీసుకువెళ్లారు. ఆలయ ఆవరణలోని భీమ నాగలింగేశ్వర స్వామి ఆలయంలో స్వామివారికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో విశిష్ట అలంకరణ పూజలు చేశారు.

ఎన్నికల సిబ్బంది పక్షపాతం

- మౌనం వీడని జిల్లా అధికారులు
- గ్రామాల్లో టీడీపీ ఫ్లెక్సీలు యథాతథం

సాక్షి, టాస్క్‌ఫోర్స్: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పటికీ ఎన్నికల అధికారులు దెందులూరు మండలంలో నిబంధనలు పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదు. విధులు నిర్వహించే గ్రామ మండల స్థాయి ఉద్యోగులు ఎన్నికల అధికారులు పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నారు. ఏ గ్రామంలోనైనా ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా అన్ని రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు తొలగించాలి లేదా ముసుగులు వేయాలి, దెందులూరు మండలంలో మాత్రం వైఎస్సార్‌సీపీ నాయకుల ఫ్లెక్సీలు తొలగిస్తున్నారు, టీడీపీ నాయకుల ఫ్లెక్సీలు తొలగించకుండా పక్షపాతం చూపిస్తున్నారు. గ్రామ మండల స్థాయి అధికారులకు వైఎస్సార్‌సీపీ నాయకులు ఎన్నిసార్లు చెప్పినా చేస్తాం, చూస్తాం అంటున్నారు తప్ప ఫ్లెక్సీలు తొలగింపునకు చర్యలు తీసుకున్న దాఖలాలు కానరావడం లేదు. జిల్లా అధికారులు కూడా కింది స్థాయి సిబ్బందిని అప్రమత్తం చేయడం లేదు. అధికారుల నిర్లక్ష్యం గ్రామాల్లో ఘర్షణలు, దాడులు, దౌర్జన్యాలు, పోలీస్ కేసులకు అవకాశం కల్పించే విధంగా ఉందని వైఎస్సార్‌సీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. ఉద్యోగులే ఒక రాజకీయ పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తే ఎన్నికల కమిషన్ నిబంధనలు ఎందుకని పలువురు ప్రశ్నిస్తున్నారు నిబంధనలు అమలు చేయాల్సిన, పర్యవేక్షించాల్సిన గ్రామ, మండల అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని వైఎస్సార్‌సీపీ నాయకులు విమర్శిస్తున్నారు. జిల్లా అధికారులు గురువారం సాయంత్రంలోపు అన్ని గ్రామాల్లో ఎన్నికల నిబంధనల ప్రకారం ఫ్లెక్సీలు తొలగించకుంటే రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని వైఎస్సార్‌సీపీ నాయకులు హెచ్చరించారు.

భూస్వాముల పక్షాన కొమ్ముకాస్తున్న అధికారులు



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి రామకృష్ణ

దెందులూరు: పేదల భూములను భూస్వాములకు కట్టబెట్టే విధంగా మండల రెవెన్యూ శాఖ అధికారులు వ్యవహరిస్తున్నారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ, దోసపాడు భూ పోరాట కమిటీ ఆరోపించింది. ఈ సందర్భంగా బుధవారం దోసపాడు భూ పోరాట కమిటీ సమావేశం పి.ఆనందరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి రామకృష్ణ మాట్లాడుతూ దోసపాడు దళితులు, పేదలు గత కొంతకాలంగా వారి అసైన్డ్, సీలింగ్ భూములు కోసం పోరాడుతున్న ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని విమర్శించారు. మండల రెవెన్యూ శాఖ అధికారులు తప్పుడు నోటీసులు ఇస్తూ పేదలను భయాందోళనకు గురిచేస్తూ సీసీఎల్ఏ కోర్టుకు రావాలని బలవంతం చేయడం దుర్మార్గమన్నారు. భూస్వాములు ఇచ్చే లంచాలతో దళితులను ఇబ్బంది పెడుతున్నారని మండిపడ్డారు. మండల రెవెన్యూ శాఖ అధికారులు అర్హులైన పేదలకు న్యాయం చేయాల్సింది పోయి భూస్వాములు పక్షాన కొమ్ముకాస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో భూ పోరాట నాయకులు జాన్ రాజు, లాజర్ మణి, ఏసుమణి, లక్ష్మి పాల్గొన్నారు.

గ్రామ దేవతలకు వెండి నేత్రాల సమర్పణ



భీమడోలులో అమ్మవార్లకు వెండి నేత్రాలను ఆలయ కమిటీ అధ్యక్షుడికి అందిస్తున్న భక్తులు

భీమడోలు: భీమడోలు గ్రామదేవతలు గంగానమ్మ, మహాలక్ష్మమ్మ, మద్దిరావమ్మ అమ్మవార్లకు గ్రామానికి చెందిన భక్తులు వెండి నేత్రాలను సమర్పించారు. ఈనెల 7 నుంచి మార్చి 9వ తేదీ వరకు భీమడోలులోని అమ్మవార్ల జాతర మహోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం గ్రామానికి చెందిన భక్తులు బంగారు ఆకాంక్ష, బంగారు పెద్ద శ్రీను, నాగవేణి గ్రామ దేవతలకు వెండి నేత్రాలు, పట్టు వస్త్రాలు, సారెను ఆలయ కమిటీ అధ్యక్షుడు దత్తాడ శ్రీనివాసరాజుకు అందించారు. తొలుత ఆలయంలో వారంతా పూజలు చేసారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు దత్తాడ శ్రీనివాసరాజు, కమిటీ ప్రతినిధులు ప్రత్తి మదన్, ఈతకోట బాబి, గంధం వెంకట్రావు, భాస్కరరావు, శేషుగిరి, యడ్ల నాగేశ్వరరావు, ఆల్తి సురేష్ పాల్గొన్నారు.

విద్యార్థుల విద్యా ప్రగతిపై నిరంతర పర్యవేక్షణ



కైకరం జెడ్పీ హైస్కూల్లో మాట్లాడుతున్న హెచ్‌ఎం

ఉంగుటూరు: కైకరం జెడ్పీ హైస్కూల్లో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులకు విద్యార్థుల గ్రేడ్ వివరాలు తెలియజేసి వారి ప్రగతిని వివరించారు. ప్రధానోపాధ్యాయులు గుళ్ల ప్రసాదరావు మాట్లాడుతూ 10వ తరగతి విద్యార్థులకు లాంగ్ పీరియడ్ టైం టేబుల్ అమలు చేస్తున్నామని, విద్యార్థులను ఏ,బీ,సీ,డీ గ్రేడ్‌లుగా విభజించి గ్రేడ్ ప్రకారం బోధన చేస్తున్నామన్నారు. ఒక్కొక్క ఉపాధ్యాయుడికి ఐదుగురు విద్యార్థులను దత్తత ఇచ్చి విద్యా ప్రగతిని పర్యవేస్తున్నామని చెప్పారు. ఉదయం, సాయంత్రం, సెలవు రోజుల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల చదువుపై ప్రత్యేక శ్రద్ధ వహించి వారిని ప్రోత్సహించాలని తెలిపారు. 10వ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు సమయంలో దాతలు సహాయంతో ఉదయం, సాయంత్ర వేళల్లో ఆహారాన్ని అందిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయులు కె.భువనేశ్వరి, జి.గవరయ్యా, పీవీ కన్నారావు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పరిశుద్ధ ఆరోగ్య మాత ఉత్సవాలు

దెందులూరు: దోసపాడులో పరిశుద్ధ ఆరోగ్య మాత ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. బుధవారం పోతునూరు ఆర్‌సీఎం చర్చి ఫాదర్ తంబి రుంజుల ఆధ్వర్యంలో దోసపాడు ఆర్‌సీఎం చర్చి సంఘ పెద్దలు సంఘస్తులు యువత మరియదల సభ్యులు పరిశుద్ధ ఆరోగ్య మాత ఉత్సవాలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఫాదర్ భాను ఫాదర్ తంబి పరిశుద్ధ ఆరోగ్య మాత విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గురువారం దాస్పాడు ఆర్.సి.యం చర్చి ఆవరణలో అన్న సమారాధన జరుగుతుందని ఫాదర్ తంబి రుంజల వివరించారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈసీసీఈ డే నిర్వహించాలి

పెదవేగి : ప్రతినెలా 5వ తేదీన అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈసీసీఈ డే నిర్వహించాలని ఐసీడీఎస్ పెదపాడు ప్రాజెక్ట్ అదనపు సీడీపీఓ సునీల్ రాజశేఖర్ అన్నారు. పెదవేగి మండలం కూచింపూడిలో సెక్టార్ సూపర్‌వైజర్ సీహెచ్ పార్వతి ఆధ్వర్యంలో స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో ఈసీసీఈ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు సీడీపీఓ సునీల్ రాజశేఖర్ మాట్లాడుతూ 3 ఏళ్ల వయస్సులోపు గల పిల్లల తల్లిదండ్రులతో సమావేశాన్ని నిర్వహించారు. సాధారణ పెరుగుదల పర్యవేక్షణ ప్రాముఖ్యత, పిల్లల ఆరోగ్యం- పెరుగుదల తదితర అంశాలు వివరించారు.

తలకెక్కించుకోండి!

- హెల్మెట్ల వినియోగంపై అవగాహన లేమి
- నిబంధనలకు విరుద్ధంగా వాహనచోదకుల ప్రయాణం
- కొరవడిన పోలీసు శాఖ నిఘా



హెల్మెట్ చేతికి పెట్టుకుని సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనం నడుపుతున్న దృశ్యం (ఫైల్)

పెదవేగి : రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువగా తలకు తగిలిన గాయాలతోనే మరణాలు సంభవిస్తున్నాయి. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరిస్తే ఇటువంటి మరణాలు చాలా వరకు తగ్గిపోతాయి. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని కోర్టులు ఆదేశించినా, తనిఖీలు చేసి పోలీసులు జరిమానా విధిస్తున్నా వాటి వినియోగంపై ప్రజలు నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు. రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువ మరణాలు సంభవించేది ద్విచక్ర వాహన ప్రమాదాల్లో తలకు తగిలే గాయాలే కారణమని నివేదికలు చెబుతున్నాయి. ద్విచక్ర వాహనదారులు తలకు రక్షణ కవచం (హెల్మెట్) ధరిస్తే ఈ ప్రాణ నష్టాన్ని తగ్గించవచ్చనే ఆలోచనలతో ప్రభుత్వాలు చట్టాలు చేశాయి. కోర్టుల ఆదేశాలు జారీ చేశాయి. పోలీసులు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్లు ధరించిన వాహనం నడపాలి. హెల్మెట్ లేకుండా వాహనం నడిపితే పోలీసులు అపరాధ రుసుము వసూలు చేస్తున్నారు. రెండు సార్లు ఒకే వాహనదారుడు పోలీసులకు హెల్మెట్ లేకుండా చిక్కితే మోటారు వాహన రిజిస్ట్రేషన్‌ను రద్దు చేస్తారు. దీంతో తప్పనిసరి అని భావిస్తున్న ద్విచక్ర వాహనదారులు హెల్మెట్లు వెంట ఉంచుకుంటున్నారు. కానీ వాటిని ధరించడం లేదు. గ్రామీణ ప్రాంతాల నుంచి నగరాలకు ద్విచక్రవాహనాలపై వచ్చేవారిలో 70 శాతం మంది వాహనానికి వెనుక హెల్మెట్ తగిలించుకుంటున్నారు. కొందరు హెల్మెట్‌ను బండి వెనుక కూర్చున్న వారికో లేదా వాహనాలకు తగిలించుకోవటమో చేస్తున్నారు. నగరాలకు దగ్గర పడిన తరువాత వాటిని తీసి శిరస్సుకు ధరిస్తున్నారు. కేవలం పోలీసుల విధించే అపరాధ రుసుము నుంచి తప్పించుకునేందుకు మాత్రమే చాలామంది వాహనదారులు హెల్మెట్లు వాడుతున్నారు. తప్ప తమ ప్రాణరక్షణకు అనే వాస్తవాన్ని వారు గుర్తించడం లేదు.

నిబంధనలకు విరుద్ధంగా... వాహనాల మీద ప్రయాణించే వారు వాహన చట్టం ప్రకారం నిబంధనలకు విరుద్ధంగా పరిమితికి మించి ప్రయాణించడం నేరం. పోలీసులు కేవలం అపరాధ రుసుములు వసూలు చేయటమే కాకుండా వాహనదారులకు హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించాలి.

వాహనదారులకు అవగాహన కల్పించాలి



హెల్మెట్ల వినియోగంపై వాహనదారుల్లో అవగాహన తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ముఖ్యంగా యువత హెల్మెట్లు ధరించి వాహనం నడిపితే సురక్షితంగా ఉంటారు. వాహనదారుల రక్షణ కోసం ప్రవేశపెట్టిన విధానంపై వాహనదారులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలి.

– మెట్లపల్లి సూరిబాబు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు

వాహనదారుల శ్రేయస్సు కోసమే



వాహనదారులు, ప్రజల శ్రేయస్సు కోసమే హెల్మెట్లు ధరించాలని చెబుతున్నాం. జరిమానా విధిస్తే బాధపడటం కంటే వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్లు ధరించటం అందరికీ మంచిది. వాటిని ధరించకుండా మోటారు వాహనాలకు తగిలిస్తే ఉపయోగం లేదు.

– కె రామకృష్ణ, పెదవేగి ఎస్సై

నిధుల దుర్వినియోగంపై షోకాజ్ నోటీస్

పెదవేగి : పెదవేగి మండలం, నడిపల్లి గ్రామ పంచాయతీలో నిధులు దుర్వినియోగంపై కలెక్టర్ విచారణ చేసి సోకాజ్ నోటీస్ జారీ చేశారు. విచారణలో తేలిన మొత్తం సొమ్ము వివరాలను అధికారులు వెల్లడించారు. పంచాయతీ కార్యాలయంలో మొత్తం సొమ్ము రూ. 11,80,769 దుర్వినియోగమైనట్టు అధికారులు నిర్ధారించారు. ఈ సొమ్మును ముగ్గురు నిందితుల నుంచి తిరిగి గ్రామ పంచాయతీలో జమ చేయాలని కలెక్టర్ జారీ చసిన షోకాజ్ నోటీసులో పేర్కొన్నారు.

మామిడి రైతులను ఆదుకోవాలి

పెదవేగి : మామిడి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని, మామిడి పంటకు ఉచిత పంటల బీమా పథకం అమలు చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుధవారం పెదవేగి మండలంలోని పెదవేగి, గార్లమడుగులో మామిడి తోటలను ఆయన పరిశీలించారు. మామిడి రైతులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కె. శ్రీనివాస్ జిల్లాలో 35వేల ఎకరాలకు పైగా మామిడి తోటలు ఉన్నాయని చెప్పారు. మూడేళ్లుగా మామిడి చెట్లకు అనేక వ్యాధులు సోకి దిగుబడులు లేక రైతులు పూర్తిగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యాన పంటలకు ప్రత్యేక ప్రోత్సాహకాలు, ఉచిత పరికరాలు అందించాలని కోరారు. మామిడికి సోకే చీడపీడల నివారణపై ఉద్యానవన శాఖ ద్వారా రైతుల్లో అవగాహన కల్పించాలన్నారు. మామిడి తోటలకు ఉచిత పంటల బీమా సౌకర్యం కల్పించాలన్నారు. రైతులకు తగిన మార్కెట్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

గణపవరం డిగ్రీ కాలేజీలో అత్యుత్తమ బోధన

గణపవరం: స్థానిక చింతలపాటి మూర్తిరాజు ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో విద్యార్థులకు అన్ని వసతులు కల్పించి, అత్యుత్తమ బోధన అందిస్తున్నట్టు ప్రిన్సిపల్ పి.నిర్మలకుమారి అన్నారు. బుధవారం కాలేజీలో ఓపెన్‌డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గణపవరం, నిడమర్రు మండలాలకు చెందిన ఇంటర్ విద్యార్థులకు కాలేజీలో అందించే కోర్సులు, అధ్యాపకులు, లేబొరేటరీ, లైబ్రరీ, క్రీడా కార్యక్రమాలు తదితర సదుపాయాలను వివరించారు. కొత్తగా ప్రవేశ పెట్టిన నాలుగేళ్ల డిగ్రీ ఆనర్ కోర్సు విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ మధురాజు, ఐక్యుఏసీ సమన్వయకర్త సీహెచ్ చైతన్య, సీనియర్ అధ్యాపకుడు టి.అక్కిరాజు, అధ్యాపకులు మాట్లాడారు. వివిధ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్, ఏవోలు, కరస్పాండెట్లు పాల్గొన్నారు.

కార్పొరేట్లకు మేలు చేసేలా కేంద్రం బడ్జెట్



గణపవరం సెంటర్‌లో బడ్జెట్ ప్రతులను దహనం చేస్తున్న సీపీఎం కార్యకర్తలు

గణపవరం: కార్మికులకు నష్టం, కార్పొరేట్లకు లాభం కలిగించే విధంగా కేంద్ర బడ్జెట్ ఉందని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్ట సత్యనారాయణ అన్నారు. బుధవారం గణపవరం పోలీస్ ఐలెండ్ సెంటర్‌లో కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా ఆందోళన నిర్వహించి, బడ్జెట్ ప్రతులను దహనం చేసి నిరసన తెలిపారు. గణపవరం సీపీఎం కార్యాలయం నుంచి వివిధ సంఘాల నాయకులు ప్రదర్శనగా నినాదాలు చేస్తూ పోలీస్ కూడలి వద్దకు చేరుకుని ఆందోళన నిర్వహించారు. అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కెరుషాన్సీ, సీఐటీయూ మండల అధ్యక్షుడు పెంటారావు, హసీనాబేగం తదితరులు పాల్గొన్నారు.

గీతారాణికి పరామర్శ



గీతారాణిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

ఉంగుటూరు: నారాయణపురంలో ఉంగుటూరు మండల వైఎస్సార్‌సీపీ నాయకురాలు ఉండ్రాజవరపు గీతారాణిని బుధవారం మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు పరామర్శించారు. గీతారాణి మాతృమూర్తి ఈ నెల 31న మృతి చెందారు. బుధవారం గీతారాణి నివాసానికి వాసుబాబు, పలువురు పార్టీ నాయకులు ఆమెను వెళ్లి పరామర్శించి సంతాపాన్ని తెలిపారు. మండల కన్వీనర్ మరడ వెంకట మంగారావు, మాజీ ఏఎంసీ చైర్మన్ రమావతి, పార్టీ ప్రెసిడెంట్ పైడి అరుణ్‌కుమార్, మాజీ ఉపసర్పంచ్ అడపా శ్రీనివాసరావు, నాయకులు బల్ల త్రిమూర్తులు, పెనుమాక విజయబాబు, శ్రీను పాల్గొన్నారు.

నూతన వేదిక ప్రారంభోత్సవం

దెందులూరు: తమ కుటుంబం ఇలవేల్పు అచ్చమ్మ పేరంటాలు తల్లి ఉత్సవాలకు ప్రాధాన్యత ఇస్తుందని ఏలూరు నగర మేయర్ నూర్జహాన్ పెదబాబు అన్నారు. మేయర్ ఆర్థిక సహాయంతో నిర్మించిన నూతన వేదికను మేయర్ బుధవారం ప్రారంభోత్సవం చేశారు. ఆలయ కమిటీ పెదబాబు, నూర్జహాన్‌లకు స్వాగతం పలికి ఘనగా సత్కరించారు.